# గులాబీ నేతల సంబురాలు

- ప్రభుత్వం విద్యుత్ చార్జీల ఉపసంహరణపై హర్షాతిరేకాలు
- కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం
- స్వీట్లు పంచి సంబురాలు చేసుకున్న బీఆర్ఎస్ నేతలు



జహీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

జహీరాబాద్, అక్టోబర్ 30: వినియోగదారులపై విద్యుత్ చార్జీల భారం మోపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను విద్యుత్ నియంత్రణ మండలి దృష్టికి తీసుకెళ్లి పెంచకుండా కృషి చేసినందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బుధవారం జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసి టాపాసులు కాల్చుతూ, స్వీట్లను పంపిణీ చేసి సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ, మరో వైపు వినియోగదారులపై రూ.18,500 కోట్ల చార్జీల భారాన్ని మోపేందుకు ప్రభుత్వ ప్రయత్నాలను బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు వ్యతిరేకించారన్నారు. విద్యుత్ నియంత్రణ మండలి దృష్టికి తీసుకెళ్లి విద్యుత్ చార్జీలు పెంచవద్దని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ చార్జీల పెంపునకు చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో బీఆర్ఎస్ వాదనలను నియంత్రణ మండలి గుర్తించి చార్జీల పెంపును ఉపసంహరించుకుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. విద్యుత్ చార్జీలు పెంచకుండా కృషిచేసిన కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డి, మధుసుదనాచారి, నియంత్రణ మండలి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఆయా మండలాల అధ్యక్షులు తట్టు నారాయణ, రవీందర్, రవీందర్, సంజీవ్‌రెడ్డి, నర్సింలు, వెంకటేశం, పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్, నాయకులు నామ రవికిరణ్, యాకుబ్, బండి మోహన్, హీరు రాథోడ్, నర్సింహాగౌడ్, రాజ్‌కుమార్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## ఆలయాలకు కేటాయించిన భూములను రక్షించాలి

జిన్నారం, అక్టోబర్ 30: జంగంపేట గ్రామంలో ఆలయ నిర్మాణాల కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించారని, గ్రామస్తుల సమక్షంలో సర్వే జరిపి ఆలయానికి కేటాయించిన స్థలాన్ని కాపాడాలని గ్రామస్తులు బుధవారం కలెక్టరేట్, జిన్నారం రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. జంగంపేట గ్రామంలో సర్వే నంబర్ 375లోని పట్టాదారులు, గ్రామస్తులకు ఎవరికీ సమాచారం ఇవ్వకుండా సర్వే చేయించి రేణుకా ఎల్లమ్మ ఆలయం పక్కన మరిన్ని ఆలయాలు నిర్మించేందుకు కేటాయించిన ఎకరం స్థలాన్ని ఆక్రమించారని, జరిగిన సర్వేపై పలు అనుమానాలు ఉన్నాయని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గ్రామస్తుల సమక్షంలో మళ్లీ సర్వే జరుపాలని కోరారు. ఆక్రమణలో అధికారుల పాత్ర ఉందని అనుమానాలు వ్యక్తం చేశారు. మాజీ ఉపసర్పంచ్ శంకర్, దుర్గయ్య, మల్లేశం, శ్రీశైలం, నవీన్, నర్సింలు, నర్సింగ్‌రావు, మహేశ్ పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

సిర్గాపూర్, అక్టోబర్ 30: మండలంలోని కిషన్ నాయక్‌తండాలో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి బుధవారం తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు మంగళవారం అర్ధరాత్రి సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రూ. 21,760 నగదు సీజ్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు. వీరిని కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు. దీపావళి పేరుతో ఎవరైనా పేకాట ఆడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**న్యాల్‌కల్‌లో..**

జహీరాబాద్, అక్టోబర్ 30: న్యాల్‌కల్ మండలంలోని గణేశ్‌పూర్ శివారులో బుధవారం రాత్రి పేకాట స్థావరంపై హద్నూర్ పోలీసులు దాడి చేశారు. నమ్మదగ్గ సమాచారం మేరకు ఎస్ఐ చల్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న పది మందిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.5,550 నగదు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్డీవోగా రాంరెడ్డి బాధ్యతల స్వీకరణ



జహీరాబాద్, అక్టోబర్ 30: జహీరాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారిగా రాంరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్డీవోగా పనిచేసిన రాజు మహబూబాబాద్ ఆర్డీవోగా బదిలీ అయ్యారు. అక్కడి నుంచి రాంరెడ్డి జహీరాబాద్‌కు బదిలీపై వచ్చారు. ఈ మేరకు ఆయన ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టారు. స్థానిక రెవెన్యూ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

## పట్టపగలే ఘన వ్యర్థాల కాల్చివేత

బొల్లారం అక్టోబర్ 30: పర్యావరణానికి, మనిషి ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారిన రసాయన ఘన వ్యర్థాలను రోడ్డు పక్కన నిర్మానుష్య ప్రదేశంలో పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేసిన ఘటన ఐడీఏ బొల్లారం పారిశ్రామిక వాడలో బుధవారం చోటుచేసుకుంది. రసాయన ఘన వ్యర్థాల కాల్చివేతతో వాతావరణంలోకి పెద్దఎత్తున దట్టమైన నల్లని పొగలు ఆవరించాయి. ఈ ఘటనపై పారిశ్రామిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను పారిశ్రామిక వాడ ప్రజలు కోరుతున్నారు.

## జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికలు

జిన్నారం, అక్టోబర్ 30: జిన్నారం గిరిజన గురుకులంలో నవంబర్ 2న అండర్ 17 ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అమూల్యామ్మ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు సంబంధించి ఎంపిక కోసం ఉమ్మడి మెదక్ జిల్లా విద్యార్థులు తమ ఒరిజినల్ బోనాఫైడ్‌తో ఉదయం 9గంటలకు జిన్నారం గురుకుల పాఠశాలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు శ్రీనివాస్‌గౌడ్ 62814 40401, రామరాజు 95057 96688 నంబర్లకు సంప్రదించాలన్నారు.

## గంజాయి స్వాధీనం.. వ్యక్తిపై కేసు నమోదు

అందోల్, అక్టోబర్ 30: ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు జోగిపేట ఎక్సైజ్ సీఐ సాగర్‌రెడ్డి తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం వట్‌పల్లి మండలం బుడ్డాయిపల్లి గ్రామంలోని తెనుగు గోపాల్ ఇంట్లో సోదాలు నిర్వహించగా 300 గ్రాములు ఎండు గంజాయి లభించిందన్నారు. దీంతో అతడి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు విజయ్‌కుమార్, సందీప్‌రెడ్డి, సిబ్బంది సాయిలు, ముఖీం, విక్రమ్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులపై చర్చిస్తున్న అమీన్‌పూర్ మున్సిపల్ పాలకవర్గ సభ్యులు

## విలీన గ్రామాల్లో అభివృద్ధి ఆగొద్దు

**అమీన్‌పూర్ మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు**

అమీన్‌పూర్, అక్టోబర్ 30: అమీన్‌పూర్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం గురువారం పురపాలిక కార్యాలయంలో చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అధ్యక్షతన కమిషనర్ జ్యోతిరెడ్డి నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నర్సింహాగౌడ్ పాలకవర్గ సభ్యులు, కోఅప్షన్ సభ్యులు ఎజెండాలో పొందుపర్చిన అభివద్ధి పనులకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనమైన కిష్టారెడ్డిపేట్, పటేల్‌గూడ, సుల్తాన్‌పూర్, దయార, ఐలాపూర్, ఐలాపూర్ తండాలో అభివృద్ధి పనులపై చర్చించి ఆమోదం తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రహదారులు, శానిటేషన్, నిర్వహణ, హరితహారానికి రూ.10.40 కోట్ల ప్రతిపాదనలకు తీర్మానం చేశారు. సమావేశంలో ఆర్వో మధుసూదన్‌రెడ్డి, డీఈ వెంకటరమణ, ఏఈ ప్రవీణ్, కౌన్సిలర్లు బాసెట్టి కష్ణకల్పన ఉపేందర్‌రెడ్డి, కవితాశ్రీనివాస్‌రెడ్డి, కొల్లూరి మల్లేశ్, బిజిలీ రాజు, చదువు మల్లేశ్, నవనీత జగదీశ్, ప్రమోద్‌రెడ్డి పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో రాజీ పడం



బాలాజీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి

బొల్లారం అక్టోబర్ 30: అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడమని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ కొలన్ రోజాబాల్ రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 3, 6, 8, 9 వార్డుల్లో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు కౌన్సిలర్లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. మున్సిపల్ సాధారణ నిధులు 50 లక్షల చొప్పున కేటాయిస్తూ ఆయా వార్డులో సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టినట్లు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా మౌలిక వసతుల ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు చైర్‌పర్సన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయి కిరణ్‌రెడ్డి, గుండ్ల సుజాతా మహేందర్ రెడ్డి, ఏఈ కిష్టయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.


## మట్టి ప్రమిదలే వెలిగించాలి



మట్టి ప్రమిదలను ప్రదర్శిస్తున్న పారిశుధ్య కార్మికులు

బొల్లారం, అక్టోబర్ 30: 'స్వచ్ఛ దివాళి – శుభ్ దివాళి' స్ఫూర్తితో దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకోవాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం రాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, కమిషనర్ మంగతాయారు పిలుపుమేరకు బొల్లారం మున్సిపల్ పాత కార్యాలయ ఆవరణలో స్వచ్ఛ సర్వేక్షణ్ నిర్వహించారు. పారిశుధ్య సిబ్బందితో కలిసి మట్టి ప్రమిదలను ప్రదర్శించారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు రఘురాంరెడ్డి, సూపర్‌వైజర్లు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, అక్టోబర్ 30: భారతీనగర్ డివిజన్‌కు చెందిన లబ్ధిదారులకు కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. బొంబాయికాలనీకి చెందిన రజిని జెస్సికాకు రూ.20వేలు, ఎంఐజీకి చెందిన చంద్రయ్యకు రూ.60వేలు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా వచ్చిన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలు ప్రైవేట్ దవాఖానల్లో వైద్యం చేయించుకోవడానికి సీఎంఆర్‌ఎఫ్ దోహదపడుతుందన్నారు. అనంతరం డివిజన్ అభివృద్ధిపై బల్దియా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, నర్సింగ్‌రావు ఉన్నారు.

## ఉపాధి హామీలో అక్రమాలు



సామాజిక తనిఖీలో జిల్లా అధికారులు

మనూరు, అక్టోబర్ 30: మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో అక్రమాలు జరిగినట్టు తేలింది. మండల పరిధిలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై జిల్లా అధికారులు డీఆర్డీవో అదనపు పీడీ బాలరాజ్, అడిషనల్ విజిలెన్స్ అధికారి నాగేశ్వరరావు బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. 1 మార్చి 2023 నుంచి 31 మార్చి 2024 వరకు సంబంధించి రూ.3కోట్ల 71లక్షలతో పలు గ్రామాల్లో నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో పనులు జరగకుండానే బిల్లులు కాజేశారని, ఆదివారం సైతం పనులు నిర్వహించిట్లు తేలిందన్నారు. ఆశ వర్కర్లు ఉపాధి హామీ పనులు కల్పించి బిల్లులు చెల్లించినట్లు తనిఖీ సిబ్బంది చెప్పారు. మొత్తం రూ.1,15,609 రికవరీ పెట్టి ముగ్గురు టెక్నికల్ అసిస్టెంట్లు, 10 మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ రాజు, ఎస్ఆర్పీ ముత్యాయ్య, ప్రత్యేక అధికారి రమేశ్ బాబు, ఎంపీడీఓ అలివేలు మంగా పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు సన్మానం



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

సదాశివపేట, అక్టోబర్ 30: సదాశివపేట మున్సిపల్ పారిశుధ్య కార్మికులు గొప్ప మనసు చాటుకున్నారు. స్థానిక గురునగర్ కాలనీలో ఓ ఇంటి కుటుంబ సభ్యులు ఇంటిని శుభ్రం చేస్తూ అనుకోకుండా బంగారు నగలను చెత్తబుట్టలో పడేశారు. వెంటనే కుటుంబ సభ్యులు పారిశుధ్య కార్మికులకు సమాచారం అందించారు. స్పందించిన కార్మికులు డంప్‌యార్డులో 24 గంటలపాటు వెతికి బంగారు నగలను బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. పోగుట్టుకున్న నగలను నిజాయితీగా అప్పగించినందుకు కార్మికులు రాము, భాగ్యమ్మను ఇంటి యజమానులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## బాలికపై లైంగిక దాడి.. యువకుడి అరెస్టు

జహీరాబాద్, అక్టోబర్ 30: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని అరెస్టు చేసినట్టు జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం జీవంగి గ్రామానికి చెందిన కొనిగిరి వినీల్‌కుమార్(19) ఏడు నెలల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో న్యాల్‌కల్ మండలం రాఘవాపూర్‌కు చెందిన బాలిక(15)తో పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నానని ప్రలోభపెట్టి, ఫోన్లో మాట్లాడుతూ, చాటింగ్ చేస్తున్నాడు. నెల రోజుల క్రితం బాలిక ఊరు పేరు తెలుసుకొని గ్రామానికి వచ్చాడు. బాలికను గ్రామ శివారుకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఈ విషయాన్ని తండ్రికి చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై అత్యాచారం, ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువకుడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తే బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్టు ఒప్పుకున్నాడు. అరెస్టు చేసి, జహీరాబాద్ మున్సిఫ్ కోర్టులో హాజరు పర్చగా, జడ్జి 14 రోజుల రిమాండ్ విధించి కంది జైలుకు తరలించారు.

## ప్రతి ఉద్యోగికి విరమణ సహజం



ఎస్ఐ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న అదనపు ఎస్పీ సంజీవరావు

సంగారెడ్డి, అక్టోబర్ 30: ప్రతి ఉద్యోగికి విరమణ సహజమని అదనపు ఎస్పీ సంజీవరావు అన్నారు. బుధవారం పదవీ విరమణ పొందిన ఎస్ఐ చంద్రశేఖర్‌కు ఘనంగా వీడ్కోలు పలికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎస్ఐ చంద్రశేఖర్ 1983లో మహబూబ్‌నగర్ జిల్లాలో పోలీసు కానిస్టేబుల్‌గా నియామకమై, గడిచిన 42సంవత్సరాలుగా మహబూబ్ నగర్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో వివిధ స్టేషన్‌లు, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో విధులు నిర్వహించారన్నారు. అంచలంచెలుగా పదోన్నతులు పొందుతూ సబ్–ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందారన్నారు. విరమణ అనంతరం శేష జీవితం కుటుంబసభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ వెంకటేశం, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఆర్ఐ రామారావ్, ఆర్ఎస్ఐ హన్మంత్‌రెడ్డి, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## పిడుగుపడి 17 గొర్రెలు మృతి

అందోల్, అక్టోబర్ 30: పిడుగుపడి 17 గొర్రెలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని డాకూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గొల్ల మల్లయ్య రోజు మాదిరిగానే తన గొర్లను తీసుకుని గ్రామ శివారులోని చెన్నకేశవస్వామి ఆలయం ఆవరణలో గడ్డికోసం వెళ్లాడు. రాత్రి సమయంలో ఇంటికి వస్తున్న క్రమంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో చెట్టుకింద నిలడ్డాడు. గొర్రెలు మరో చెట్టుకింద ఉన్నాయి. ఇదే సమయంలో భారీ శబ్దంతో పిడుగు పడడంతో 17 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో బాధితుడు మల్లయ్య బోరున విలపించాడు. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



ఝరాసంగం: మాట్లాడుతున్న తహసీల్దార్ తిరుమలరావు

ఝరాసంగం, అక్టోబర్ 30: ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ తిరుమలరావు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో సామాజిక, విద్య, ఉద్యోగం, రాజకీయం, కుల గణన అంశాలపై సర్వే పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. నాయబ్ తహసీల్దార్ యాసిన్, ఎంపీడీవో సుధాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ సృజన్, ఆర్ఐ రామరావు, ఏవో వెంకటేశం, ఏపీవో రాజ్‌కుమార్, ఏపీఎం టీకే నాయక్ పాల్గొన్నారు.

**కుల గణన సవ్యంగా చేపట్టాలి**

సిర్గాపూర్, అక్టోబర్ 30: గ్రామాల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియ సవ్యంగా కొనసాగించాలని ఎంపీడీవో మల్సూర్‌నాయక్ ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఎన్యూమరేటర్లు, కార్యదర్శులను సమావేశపరిచి కుల గణనపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమాశంకర్, ఎంఈవో నాగారం శ్రీనివాస్, ఏపీవో బస్వరాజ్, ఎంపీవో బ్రహ్మంచారి, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

**నాగల్‌గిద్దలో..**

నాగల్‌గిద్ద, అక్టోబర్ 30: ఇంటింటా సమగ్ర సర్వే పక్కగా నిర్వహించాలని ఎంపీడీవో మహేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని రైతు వేదికలో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్‌లకు నిర్వహించిన శిక్షణ శిబిరానికి హాజరై మాట్లాడారు.

**రాయికోడ్‌లో..**

రాయికోడ్, అక్టోబర్ 30: సామాజిక ఆర్థిక, విద్యా కులగణన పక్కగా చేపట్టాలని ఎంపీడీవో ఎంఎం షరీఫ్ అన్నారు. రాయికోడ్ రైతు వేదికలో మాట్లాడుతూ 150 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపీవో అంజలీదేవి, సూపరింటెండెంట్ నరసింహారెడ్డి, మండల పశు వైద్యాధికారి పాండ్యన్, ఏఈ తహ, గోపాల్ ఉన్నారు.

**న్యాల్‌కల్‌లో..**

జహీరాబాద్, అక్టోబర్ 30: బీసీ కుల గణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని మండల అభివృద్ధి అధికారులు పేర్కొన్నారు. జహీరాబాద్, న్యాల్‌కల్‌లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కుల గణన సర్వే సిబ్బందికి ఆయా మండల అభివృద్ధి అధికారులు మహేందర్‌రెడ్డి, రాజశేఖర్, శిక్షకులు అవగాహన కల్పించారు.

**బొల్లారంలో..**

బొల్లారం, అక్టోబర్ 30: ప్రభుత్వ పథకాలు చిట్ట చివరి పేదవాడికి చేరేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక ఆర్థిక సర్వేను దిగ్విజయంగా పూర్తి చేయాలని బొల్లారం మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్ అన్నారు. మున్సిపల్ తాత్కాలిక కార్యాలయంలో సామాజిక ఆర్థిక సర్వేపై ఎన్యూమరేటర్లకు కమిషనర్ మంగతాయారు ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు.



కమిషనర్ ఉమామహేశ్వర్‌రావుకు సమ్మె నోటీసు ఇస్తున్న నాయకులు, కార్మికులు

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జహీరాబాద్, అక్టోబర్ 30: జహీరాబాద్ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఉమామహేశ్వర్‌రావుకు వినతి పత్రం, సమ్మె నోటిసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏండ్లుగా మున్సిపల్‌లో కాంట్రాక్టు కార్మికులు తక్కువ వేతనంతో పనిచేస్తున్నారన్నారు. కార్మికులు చేస్తున్న శ్రమను ప్రభుత్వాలు గుర్తించడం లేదన్నారు. కార్మికులకు న్యాయపరంగా రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ బిల్లులను వెంటనే చెల్లించాలని, అలాగే పీఎఫ్ విత్‌డ్రాలో నెలకొన్న సమస్యలను నవంబర్ 13వ తేదీలోగా పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో కార్మికులు సమ్మెకు దిగుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యశోదమ్మ, మోహన్, చంటి, కాంతమ్మ, సిద్ధమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



జిన్నారం: ఊట్లలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

జిన్నారం, అక్టోబర్ 30: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం నరేందర్ అన్నారు. మండల కేంద్రం జిన్నారం, ఊట్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. సోలక్‌పల్లి, వావిలాల గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాగా ఐకేపీ ఆధ్వర్యంలో జిన్నారం, ఊట్ల గ్రామాల్లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, మాజీ ఎంపీపీ గంగురమేశ్, రాజుగౌడ్, నరేశ్, జింకల శివరాజ్, రవీందర్, నరేందర్‌గౌడ్, జనార్దన్‌గౌడ్, సుధాకర్, శంకరయ్య, భాస్కర్, ప్రవీన్, సంజీవ, రైతులు పాల్గొన్నారు.

**పుల్కల్‌లో..**

పుల్కల్, అక్టోబర్ 30: కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గారెడ్డి అన్నారు. గొంగ్లూరు, ఇసోజీపేట, మిన్పూర్, ముద్దాయిపేట, పెద్దారెడ్డి పేటలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

## సబ్ స్టేషన్‌తో కరెంట్ కష్టాలు దూరం

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, అక్టోబర్ 30: విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో ఆర్సీపురం, భారతీనగర్ డివిజన్‌ల్లో కరెంట్ సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. భారతీనగర్ డివిజన్‌లోని బీడీఎల్ కాలనీలో సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం బుధవారం ప్రభుత్వ స్థలాన్ని కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. భూమి వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్సీపురం, భారతీనగర్ డివిజన్‌లలో పలు కాలనీలు ఏర్పడడంతోపాటు జనాభా పెరిగిపోయిందని, అందుకు అనుగుణంగా ప్రస్తుతం ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ సామర్థ్యం సరిపోకపోవడంతో కరెంట్ సమస్యలు వస్తున్నాయన్నారు. కరెంట్ సమస్యలను పరిష్కరించేందుకు రూ.6 కోట్లతో 33/11కేవీ నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. త్వరలోనే సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. బీడీఎల్ కాలనీలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నగేశ్, అంజయ్య, ఐలేశ్, పరమేశ్, నర్సింగ్‌రావు, పెద్దరాజు, బీడీఎల్ కాలనీ సొసైటీ సభ్యులు రమేశ్, విఠల్‌రెడ్డి, చాంద్ పాషా, విద్యుత్ శాఖ డీఈ భాస్కర్‌రావు, ఏడీఈ దుర్గాప్రసాద్, ఏఈ సంజీవ్‌రావు, ఆర్ఐ శ్రీకాంత్ ఉన్నారు.

## పత్తికి మద్దతు ధర కల్పించాలి

సదాశివపేట, అక్టోబర్ 30: పత్తికి మద్దతు ధర రూ.10 వేలు కల్పించాలని, వెంటనే సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని మెలిగిరిపేటలో పత్తి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. సీపీఎం ఏరియా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, నాయకులు యాదవరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE II ADDITIONAL DISTRICT AND SESSION JUDGE AT : SANGAREDDY**

**O.S.No. 245 OF 2022**

Between:
Smt. Munnuru Satyamma & others ...Plaintiffs
AND
Sri. Ganta Venkatesham & Others ...Defendants

To
D5. Chinthalapati Krishnam Raju, S/o. Subba Raju, Aged about 54 Years, Occ: Agriculture, R/o.H.No.3-7-83/100/ 1/A/1/A, Sadashivapet Town & Mandal, Medak District.
D6. Smt.Chinthapati Sridevi, W/o. Sri. Ch.Krishnam Raju, Aged about 47 Years, Occ: Housewife, R/o.H.No.3-7-83/100/1/A/1/A, Sadashivapet Town & Mandal, Medak District.
D7. Smt. M. Geeta Gayatri, W/o.Sri. M. Sri Ramakrishna Raju, Aged about 43 Years, Occ: Business, R/o. Plot No.330, Jalavayu Vihar, Kukatpally, Hyderabad City.
D8. M. Sri Ramakrishna Raju, S/o. Sri M.S. Raju, Aged about 51 Years, Occ: Business, R/o. Plot No.330, Jalvayu Vihar, Kukatpally, Hyderabad City.

My client Smt.Munnur Sathyamma and others have filed the above suit seeking the partition of the suit scheduled property and also consequential relief of cancellation of registered sale deeds mentioned in the suit scheduled property against you, before the II Additional District And Session Judge, at Sangareddy. The above case is posted to 06-11-2024 at 10.30 a.m., for your appearance. Hence, this notice.

/ /BY ORDER OF THE COURT/ /
**Sd/- SHAIK MAHABOOB VALI**
Advocate
Flat No.301 & 302, MCH No.12-2-825 & 826/A, Manzil Chambers, Lane Opp. Pillar No.17, Mehdipatnam, Hyderabad-500028.
Cell No.9989207444
Dt.31-10-2024
Place: Sangareddy



